అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 05 జులై 2023

ప్రజల క్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-పిట్లం

ప్రజల క్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసవి రమేష్, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన బాలయ్య ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రి పాలైనందున ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా స్పందించిన ప్రభుత్వం బాధితుడికి రూ. 60 వేలు మంజూరు చేయటంతో ఆ చెక్కును అందజేసినట్టు వివరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, జగదీష్, బుడాల నవీన్ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు నాయకులు

మొండి వీరన్న తండాలో శీతల ఉత్సవాలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొడుగు మర్రి తండ గ్రామపంచాయతీ పరిధిలో మొండి వీరన్న తండాలో మంగళవారం శీతల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిరిజన సంప్రదాయాలతో, గిరిజన ఆరాధ్య దైవం శీతల దేవునికి నైవేద్యం, బోగుబండాను సమర్పించి, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రవంత పరమేష్, గిరిజన తాండ పెద్ద మనుషులు తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలి

- స్వామినాథ్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి
- ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న మూడ్ శోభన్

రైతులకు మద్దతు ధరల (ఎంఎస్‌పీ) గ్యారెంటీ చట్టం తీసుకురావాలని ఏఐకెఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాందేవాడ రైతు సంఘం కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్వామినాథన్ సిఫారసులు అమలు చేయడం లేదని అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో రైతులకు నష్టమే వాటిల్లుతుంది తప్పా.. పెట్టిన పెట్టుబడి సైతం తిరిగిరాని పరిస్థితి నెలకొందని అన్నారు.

వరికి మద్దతు ధర కేంద్రం క్వింటాకు రూ.2183 ధర ప్రకటించిందని, అయితే క్వింటాకు రైతులు 680 రూపాయలు నష్టపోతున్నారని తెలిపారు.

జొన్నలకు క్వింటాలకు 3168 మద్దతు ధర ప్రకటించగా నష్టం రూ.1114 రూపాయలు నష్టం జరుగుతోందని అన్నారు. సజ్జలకు 2500 ప్రకటించగా క్వింటాలకు 650 రూపాయలు నష్టం వాటిల్లుతుందని అన్నారు. మొక్కజొన్న 2090 రూపాయలు మద్దతు ధర ప్రకటించగా 606 రూపాయలు నష్టం వస్తుందని అన్నారు. అదే విధంగా వేరుశనగ, సోయాబీన్, పత్తి తదితర పంటలకు మద్దతు ధర ప్రకటించినా రైతులకు మాత్రం నష్టమే వాటిల్లుతుందని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసు అమలు చేసి పంటలకు మద్దతు గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలని దానివల్ల రైతాంగానికి ఎలాంటి నష్టం ఉండదని అన్నారు. రైతులు అప్పులు కట్టుకోలేక సంవత్సరానికి 12,600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారస్ ప్రకారం పెట్టిన పెట్టుబడికి సగం కలిపి మద్దతు ధర ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్, ఉపాధ్యక్షులు తోగట్టి భూమన్న, దేవేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చినుకులేక దిగులు

- ఉమ్మడి జిల్లాలో తీవ్రలోటు వర్షపాతం
- 44 మండలాల్లో పరిస్థితి తీవ్రం
- సాగులో రైతన్నకు తిప్పలు
- ముదురుతున్న ఎండలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వరుణుడి రాక కోసం ఉమ్మడి జిల్లాలోని ప్రజలు, రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మృగశిరకార్తె వెళ్లిపోతున్నా జిల్లాలో మాత్రం వర్షాలు పడటం లేదు. నైరుతి రుతుపవనాల కాలం నెల గడిచిపోతున్నా ఇప్పటి వరకు జిల్లాలో సరిపడా వర్షాలు కురవలేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని మండలాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 44 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదయ్యింది. మరోవైపు వర్షాలు కురవాల్సిన సమయంలో అందుకు విరుద్ధంగా ఎండలు ముదురుతున్నాయి. గడిచిన మూడు రోజులుగా జిల్లాలో 35 డిగ్రీల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతుకు ఆదిలోనే అడ్డంకులు మొదలయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటుతున్నా వరణిడి జాడ కనబడటం లేదు. జిల్లాలో ఇప్పటి వరకు ఒక్కసారిగా కూడా అధిక వర్షపాతం నమోదుకాలేదు. రబీ సీజన్ చివరిలో పంట కోతల సమయంలో అకాల వర్షాలతో రైతుకు నష్టం వాటిల్లగా.. ఇప్పుడు ఖరీఫ్ సీజన్‌లో సాగుకు వర్షాభావ పరిస్థితులతో మళ్లీ ఇబ్బందులు ఎదురువుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలోని 33 మండలాల్లో లోటు, తీవ్ర లోటు నెలకొంది. జిల్లాలో ఇప్పటి వరకు 183.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. కేవలం 74.1 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదయ్యింది. పోతంగల్, కోటగిరి రెండు మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదయ్యింది. మిగిలిన 31 మండలాల్లో లోటు, తీవ్ర లోటు వర్షపాతం నమోదయ్యింది. కామారెడ్డిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఇప్పటి వరకు 167.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 79.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ తీవ్ర లోటు వర్షపాతం నమోదయ్యింది.



జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆరుతడి పంటల కోసం విత్తనాలు నాటిని రైతులు ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు విత్తుకోగా... మొలకలు రాక నష్టపోతున్నారు. జిల్లాలో సరిపడా వర్షాలు కురిసే వరకు విత్తనాలు నాటుకోవద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇది ఇలా ఉంటే.. గడిచిన మూడు రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయి. ఆదివారం అత్యధికంగా 36.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా.. సోమవారం (35.0), మంగళవారం (35.7) డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. అయితే కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం 26.3 డిగ్రీలుగా నమోదవుతుండటంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందని కూలర్లు తొలగించిన వారు మళ్లీ కూలర్లు ఏర్పాటు చేసుకునే పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు.

పెన్షనర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

ఆర్డీవో కార్యాలయాల ఎదుట రిటైర్డ్ ఎంప్లాయీస్ ఆందోళన


నిజామాబాద్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న రిటైర్డ్ ఎంప్లాయీస్

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తూ డీఏ విడుదల చేయకుండా ఆర్థిక ప్రయోజనాలు అందకుండా అనేక ఆటంకాలు సృష్టిస్తుందని రిటైర్డ్ఎంప్లాయీస్ ప్రతినిధులు ఆరోపించారు. పెన్షనర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం నిజామాబాద్, ఆర్మూర్‌లోని ఆర్డీవో కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టారు. నిజామాబాద్‌లో సిర్పా హనుమాన్లు అధ్యక్షతన నిర్వహించిన ఆందోళనలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్.మదన్ మోహన్ మాట్లాడారు. ఆర్మూర్‌లో మాదరి సాయన్న అధ్యక్షతన చేపట్టిన ధర్నాలో జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు మాట్లాడారు. ఇంటీరియం రిలీఫ్‌ను ప్రకటించి వెంటనే పీఆర్సీ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమును పటిష్టపరిచి నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులలో అనుమతించాలని, 40 సంవత్సరాలు పాటు ప్రజల కోసం పనిచేసిన వారికి ప్రభుత్వం ఇచ్చే బహుమానం ఇదేనని ఆయన అన్నారు. ధర్నా తదనంతరం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్కు మెమోరాండం సమర్పించారు. నిజామాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు ప్రసాద్ రావు, ముట్టరం నారసింహ స్వామి, డివిజన్ కార్యదర్శి అందే సాయిలు, కోశాధికారి రాధా కిషన్ జిల్లా నాయకులు ప్రసాద్, మార్కెటింగ్ కమిటీ శాఖ రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు రాజేందర్ తదితరులు పాల్గొనగా, ఆర్మూర్‌లో డివిజన్ కార్యదర్శి శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బాబా గౌడ్, వెంకటరావు కోశాధికారి రాజేందర్, తురబలీ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో నవీపేట్ పంచాయతీ ఎంపిక


సమావేశమైన గ్రామపంచాయతీ పాలకవర్గం

నవతెలంగాణ-నవీపేట్

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ -2023 జాబితాలో స్వచ్ఛ గ్రామంగా నవీపేట్ పంచాయతీని ఎంపిక అయినట్టు డిఎల్‌పిఓ శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్ అధ్యక్షతన ఎంపీడీవో పాలకవర్గంతో పాటు అధికార యంత్రాంగం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలో 530 గ్రామపంచాయతీలకు గాను 15 పంచాయతీలు, నిజామాబాద్ డివిజన్‌లో 211 పంచాయతీలలో రెండిట్లో ఒకటిగా నవీపేట్ పంచాయతీ ఎంపసికైనట్టు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా డిఎల్పిఓ శ్రీకాంత్‌ను నియమించడంతో స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు వివిధ కొలమానాలపై శాఖల అధికారులతో పనుల విభజన బాధ్యతలను అప్పగించి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, ఇంకుడు గుంతలు, మహిళా సంఘాల అభివృద్ధి, రికార్డు, రోడ్డు మ్యాపుల నిర్వహణ, ప్లాస్టిక్ ఏరివేత లాంటి 13 కోలమానాలతో పూర్తి పారిశుద్ధ్య గ్రామంగా త్వరలోనే తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. అలాగే ఇంటర్నేషనల్ స్టాండర్డైజేషన్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ) సర్టిఫికెట్‌కు సైతం ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాజిద్ అలీ, ఎంపిఓ రామకృష్ణ, ఏపీవో రాజేశ్వర్, ఎంపీటీసీ మీనా నవీన్ రాజ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులకు పట్టా రాలే

- సాగులో లేనోళ్లకు అందజేశారు
- సర్పంచ్‌పై, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని రైతుల ఆందోళన

నవతెలంగాణ-వర్ని

ఏండ్లుగా సాగులో ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం తమకు పోడు పట్టాలు ఇవ్వలేదని, సాగు చేయని పలువురికి అందాయని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్ని మండలం సైద్పూర్ తండాలో మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బందిని నిర్బంధించి కార్యాలయానికి తాళం వేసిన ఘటన చోటు చేసుకొంది. అనంతరం తహసీల్దార్ విఠల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గిరిజనులకు పోడు భూముల పట్టా పాస్ బుక్ ల పంపిణీ లో గ్రామం నుంచి 220 మందికి సర్వే చేసి అందులో 83 మందికే పట్టాలు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డిఓకు పిర్యాదు చేసి నాలుగు రోజులైనా స్పందన లేకపోగా, పంచాయతీ సర్పంచ్, సెక్రెటరీకి తెలిపినా పట్టించుకోలేదని తెలిపారు. భూమి లేని వారికీ ప ట్టాలిచ్చారని, భూమి ఉన్న తమకు పట్టాలు రాలేవని అన్నారు. పట్టా ఉన్నవారికే తిరిగి పట్టాలు ఇచ్చారన్నారు. ఆర్‌డిఓకు అడిగితె కూడా సమాధానం లేదన్నారు. పట్టాల పంపిణి లో సర్పంచ్, సెక్రటరీ ల పాత్రతో పట్టాల నమోదులో రాజకీయం చేసి వారికి అనుకూల రైతులకు భూమి లేకున్నా పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. భూమి ఉండి సాగు చేస్తున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. లేకుంటే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటిని తమ పిల్లలతో కలిసి ముట్టడిస్తామని అన్నారు. స్పీకర్ తమపై దయ చూపాలని అక్రమంగా పట్టాలు పొందిన, అందించిన వారి పై చర్యలు తీసుకోవాలని కోరారు.


జీపీ కార్యాలయానికి తాళం వేసిన గ్రామస్తులు

భూమి లేనోళ్లకు పట్టాలు ఇచ్చారు

సైదాపూర్

గ్రామ పంచాయతీ సెక్రెటరీ, సర్పంచ్ అందరి భూములు చూచి మా భూములకు పట్టాలు ఇవ్వకుండా, వాళ్ల వాళ్ల ఇండ్లలోనే ఉన్న వారికి వారి అనుచరులకు మాత్రమే పట్టాలు ఇచ్చారు. తమ భూములకు కూడా ప్రభుత్వము పట్టలు అందజేసి న్యాయం చేయాలని కోరుతున్నాము.



నా రెండు ఎకరాలకు పట్టా రాలేదు

పోడు రైతు..భూలిబాయ్. సైదాపూర్

పోచారం సారు అందరికీ భూములకు పట్టాలు ఇవ్వమంటే.. మా సర్పంచ్ సెక్రెటరీ పట్టాలు రాలేవని చెప్తున్నారు. నా పక్కన ఉన్న వాళ్లకు పట్టా వచ్చింది. నాకు ఎందుకు రాలేదని అడిగితే పంచాయతీ సెక్రెటరీ నాకు తెలదు పొమ్మను అంటున్నాడు.



పోడు భూములకు పట్టాలతో భావితరాల జీవనోపాధికి భద్రత

- ఈ సీజన్ నుంచే రైతుబంధు వర్తింపజేస్తాం
- గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేసిన మంత్రి వేముల

నవతెలంగాణ-భీంగల్


మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

రాష్ట్రంలోని పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు అందించి వారి భావితరాలకు భవిష్యత్తుకు, జీవనోపాధికి భద్రత కల్పించి వారికి ఆత్మగౌరవాన్ని కల్పించిన గొప్ప మహనీయుడు సీఎం కేసీఆర్ అని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం భీంగల్ మండలంలోని తాళ్లపల్లి వద్ద దేవక్కపేట్, కారేపల్లి, తాళ్లపల్లి, దేవన్‌పల్లి, మెండోరా, రహత్‌నగర్ గ్రామలకు చెందిన 1011 మందికి జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి పోడు పట్టాలను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు పోడు వ్యవసాయం చేసుకునే అడవి బిడ్డలు పంట వేసిన నాటి నుండి చేతికి వచ్చే వరకు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. అలాంటి పరిస్థితులను దూరం చేసి పోడు బిడ్డలకు పట్టాలు అందించాలనే సంకల్పంతో రాష్ట్రంలో లక్ష 50 వేల మందికి, నిజామాబాద్ జిల్లాలో 4300 మందికి పట్టాలు అందించి వారికి ఆత్మగౌరవాన్ని కల్పించిన గొప్ప సీఎంగా కేసీఆర్ నిలిచారని అన్నారు.

రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపనలు

మండలంలోని పురాణిపేట్ గ్రామంలో 2.25 కోట్లతో చేపట్టే భీంగల్ నుండి ముచ్కూర్ బిటీ రోడ్డు (వయా పురాణిపేట్, పల్లికొండ) పునరుద్ధరణ పనులకు మంత్రి వేముల పురాణిపేట్, పల్లికొండ గ్రామాలలో శంకుస్థాపనలు చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆర్మూర్ ఆర్‌డీవో శ్రీనివాస్, జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, యంపిపి ఆర్మూర్ మహేష్, తహసీల్దార్ శ్రీధర్‌కుమార్, యంపిడివో రాజేశ్వర్,పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య , రైతుబంధు నాయకుడు శర్మనాయక్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు లకావత్ అనిల్, చంద్రకళ వాసునాయక్, నిర్మల భూపతి, దేవాయి గంగారం మరియు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు పాల్గొన్నారు.

గురుకులాల్లో తాత్కాలిక అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

- ఈ నెల 10 చివరి గడువు

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు/ జూనియర్ కళాశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో విద్యా బోధనకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, బీఈడీలో 50 శాతం మార్కులతో రెండవ శ్రేణిలో ఉత్తీర్ణులై, టెట్ అర్హత సాధించిన వారు కామారెడ్డిలో పట్టణంలోని సరంపల్లిలో నాగిరెడ్డిపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 10 వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జిల్లాలోని బాలికల గిరిజన సంక్షేమ పాఠశాలల్లోని సబ్జెక్టుల వారీగా బోధించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, బాలికల పాఠశాలల్లో మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. పాదర్శకంగా ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో భూపోరాటాలు కొనసాగిస్తాం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్‌బాబు
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నివాళి


నివాళి అర్పించి నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్/భిక్కనూర్

దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో భూ పోరాటాలను కొనసాగిస్తాం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు అన్నారు. దొడ్డి కొమరయ్య 77వ వర్ధంతి పురస్కరించుకొని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు, డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్ మాట్లాడారు. 1946 నుండి 1951 వరకు తెలంగాణ సాయుధ రైతన్న పోరాటం కొనసాగిం దని ఆనాడు రజాకార్లకు భూస్వాములకు వ్యతిరే కంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగినట్టు తెలిపారు. వెట్టి చాకిరి విముక్తి కోసం దున్నేవాడికి భూమి కావాలని భూస్వాముల ఆగడానికి వ్యతిరేకంగా భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం దున్నేవాడికే భూమి కావాలని 5000 గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత దొడ్డి కొమరయ్యదేనన్నారు. దొడ్డి కొమరయ్య ఆశయాలకనుగుణంగా పోరాటాలు కొనసాగిస్తామని పోడు భూములకు పట్టాలచేవరకు ఇళ్ల స్థలాలు వచ్చేవరకు పేదల పక్షాన పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఏరియా కమిటీ సభ్యులు కూతాడి ఎల్లయ్య, తోకటి భువనేశ్వర్, భామండ్ల రవి, సదమస్తుల అశోక్, సిద్దాల నాగరాజు, నవీద్ ,సాయిలు, కొండ గంగాధర్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


భిక్కనూర్ : జంగంపల్లిలో నివాళి

దొడ్డి కొమురయ్య ఆశ సాధన కోసం పని చెయ్యాలి

భిక్కనూర్ : సాయుధ పోరాట రైతంగ యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి పురస్కరించుకొని భిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామంలో భూ సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం నిజాం రజాకార్లకు దేశముకులకు వ్యతిరేకంగా భూమి కోసం పోరాటం చేశాడని, ఆయన అమరత్వంతో తోటి సాయుధ పోరాటం ఉవ్వెత్తునెగేసే పడిందన్నారు. ఆ పోరాటం చేసి లక్షల ఎకరాలు భూమిని పేద ప్రజలకు కమ్యూనిస్టులు పంచారని, ఆయన ఆశయ సాధన కోసం కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ప్రవీణ్, పోచయ్య, నర్సింలు, చంద్రకళ, నరసవ్వ, రమణ, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి స్వాగతం పలికిన నాయకులు



నవతెలంగాణ-ఆర్మూర్

హైదరాబాద్‌కు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హకీంపేట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కలిసి మంగళవారం పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి స్వాగతం పలికారు.

క్విజ్‌లో ద్వితీయ స్థానం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్ పోటీల్లో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు ఎంఈఓ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, పోలీస్ లైన్, నిజామాబాదులో నిర్వహించిన జిల్లా స్థాయి ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్‌లో పాల్గొని ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను వారిని తీర్చిదిద్దిన టీచర్ అయిన జగదీశ్వర్ ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేటట్లు కృషి చేయాలని తెలిపారు.

రేపటి నుండి పంచాయతీ కార్మికుల సమ్మె

- జయప్రదం చేయండి
- జేఏసీ నాయకుల పిలుపు
- సమ్మె పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈనెల 6 నుండి నిర్వహించే గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని జేఏసీ, సిఐటియు, ఐఎఫ్టియు నాయకులు కోరారు. సమ్మె పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ దాసు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12769 పంచాయతీలో పనిచేస్తున్న 50వేల మంది ఉద్యోగ కార్మికుల వేతనాలు పెంచి వెంటనే పర్మినెంట్ చేయాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాద బీమా 10 లక్షలు, సాధారణ మరణానికి ఐదు లక్షల ఇన్సూరెన్స్ ప్రభుత్వం కట్టాలని, కార్మికులందరికీ పిఎఫ్ ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి జంగం గంగాధర్, జిల్లా నాయకురాలు పద్మ, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి కాజా మొయినుద్దీన్, జేఏసీ నాయకులు పాషా బాయ్, హుస్సేన్ సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: ఈ నెల 6 నుండి పంచాయతీ సిబ్బంది సమ్మెలో పాల్గొంటున్నారని, మీ సమస్యల పరిష్కారానికి కృషి చేసి సహకరించాలని కోరుతూ సిఐటియూ ఇందల్‌వాయి మండల అధ్యక్షులు మ్యాదరి గంగారాం ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విమలాబాయికి, పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీల ద్వారా వేతనాలు 12 పి.ఆర్.సి.లో నిర్ణయించిన మేరకు రూ. 19, వేతనంగా చెల్లించాలని, ఆ లోపు జీవో నెం.60 ప్రకారం స్వీపర్లకు 15,500 ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ. 19,500 నిర్ణయించాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించాలని, జీవో నెం.310 సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరీలన్నింటినీ యథావిధిగా కొనసాగించే విధంగా చూడాలని అయన సూచించారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సహజ మరణానికి ఇన్సూరెన్స్ పథకాన్ని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. పంచాయతీలో ఆదాయమున్న చోట వేతనాల పెంపుకు అనుమతినివ్వాలని, వేతనాలు పెంచాలని, ప్రమాద బీమా, గ్రాట్యూటీ, గుర్తింపు కార్డులు, ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు 30 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని, 8 గంటల పని అమలు చేయాలని, సెలవు దినాలను అమలుచేయాలని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, పంచాయతీ సిబ్బందికి అన్ని కార్మిక చట్టాలు అమలు చేయాలని, డిపిఅర్ఓ అనుమతి తరువాత నియామకాలు జరగాలన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లకు పంచాయతీల ద్వారానే డ్రైవింగ్ లైసెన్సు ఇప్పించాలని, వయస్సు మీరిందనే సాకుతో కార్మికులను మార్చితే ఆ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిటీగా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీంకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

2023-2024 విద్యా సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీంలో 1వ తరగతి డేస్కాలర్, 5వ తరగతిలో రెసిడెన్షియల్‌గా ఇంగ్లీషు మీడియం ప్రవేశంకోసం అర్హులైన షెడ్యుల్డు కులాల (ఎస్సీ) బాల, బాలికల నుండి దరఖాస్తులు కోరుతున్నామని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శశికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారములు సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని రూమ్ నెం. 102, షెడ్యుల్డు కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం లో ఈనెల 03 నుండి 15 వరకు తీసుకోవాలని పేర్కొన్నారు. 1వ తరగతిలో దరఖాస్తు చేసేవారు 2017 జూన్ 01 నుండి 2018 మే 31 మధ్యలో జన్మించి ఉండాలని తెలిపారు. సంవత్సర ఆదాయం అర్బన్ లో రూ.2లక్షలు, రూరల్ లో రూ.లక్షా50వేల మించొద్దని పేర్కొన్నారు. కుల, ఆదాయ ధృవికరణ ఒరిజినల్, నేటివిటి ధృవీకరణ, పుట్టిన తేది ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్పోర్టు సైజు ఒక ఫోటో తప్పనిసరిగా దరఖాస్తు కు జతపరచాలని పేర్కొన్నారు. 5వ తరగతి దరఖాస్తు దారులు వాటితో పాటు 4వ తరగతి ప్రొగ్రెస్ కార్డు, బోనాఫైడ్ జిరాక్స్ ప్రతిని తప్పనిసరిగా జతపరచాలని, ఏ ఒక్కటీ లేకున్నా తిరస్కరించబడునని తెలిపారు. జిరాక్స్ ప్రతులపై తప్పనిసరిగా గజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేయించాలని పేర్కొన్నారు. దరఖాస్తు దారులు పూర్తి చేసిన దరఖాస్తు ఫారములు సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 15 సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని తెలిపారు. ఈనెల 20 న జిల్లా స్థాయి ఎంపిక కమిటి ఆద్వర్యములో లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు నేడు సెలక్షన్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

స్పోర్ట్స్ స్కూల్ లో ప్రవేశాలకు బుధవారం సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి ఆంధ్రయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 4వ, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు సెలక్షన్స్ లో పాల్గొనాలని తెలిపారు. మండల ఫిజికల్ డైరెక్టర్లు రాజేందర్, స్వప్న పీఈటీలు గంగాధర్, నగేష్, మాధురి, నవ్య, సుప్రియ లు పాల్గొని ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలకు మెమో జారీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలకు మెమో జారీ చేసినట్లు మండల విద్యాధికారి రాజా గంగారాం మంగళవారం తెలిపారు. యాప్ పేరుతో విద్యార్థుల నుంచి ఒక్కొక్కరికి చొప్పున1500 ఫీజులు వసూలు చేస్తున్నారని పలు విద్యార్థి సంఘాలు కంప్లైంట్స్ ఇచ్చినందున వివరణ కోరుతూ పాఠశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీస్ జారీ చేసినట్టు పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఎవరు కూడా యాప్‌ల పేరుతో ఫీజులు వసూలు చేస్తే చెల్లించకూడదని తెలిపారు.

శ్రీ చైతన్యలో 8,9,10కి అనుమతిలేదు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

శ్రీ చైతన్య లో 8,9,10 తరగతులకు అనుమతి లేదని డిఇఓ ఎన్వి దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం నిజామాబాద్ పట్టణంలో వినాయకనగర్ కాలనీలో శ్రీ చైతన్య స్కూల్ ప్రభుత్వ గుర్తింపు లేకుండా 8 నుండి 10వ తరగతి వరకు ప్రవేశాలు చేసుకొని తరగతులు నిర్వహిస్తున్నారని డిఇఓ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. పాఠశాలలో 8,9,10వ తరగతి వరకు తరగతులు వెంటనే మూసివేయాలని హెచ్చరించారు. ఆ తరగతి పిల్లలను దగ్గరలో గల మరొక పాఠశాలకు చేర్పించేందుకు తగు చర్యలు చేపట్టాని మండల విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి చేయూత

- నవతెలంగాణ కథనంతో ఆదుకునేందుకు పలువురి ముందుకు


సిద్ధార్థ్‌కు భరోసా ఇస్తున్న మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్

ప్రతిభకు పేదరికం అడ్డు అనే శీర్షికన నవ తెలంగాణ పత్రికలో సోమవారం కథనం ప్రచురితం కావడంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి తనవంతుగా సహకరించేందుకు ముందడుగు వేశారు. జాతీయస్థాయి నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సంపాదించి ఎంబీబీఎస్ సీటు పొందిన సిద్ధార్థ్ కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో చదువుకునేందుకు వెనుకడుగు వేస్తుండడంతో చేయూత ఇచ్చేందుకు వడ్డీ మోహన్ రెడ్డి మంగళవారం వారి ఇంటికి వెళ్లి భరోసా ఇచ్చారు. దళిత బిడ్డ సిద్ధార్థ్ ను రాజకీయాలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎంపీటీసీ రాధా, ఆనంద్, రామకృష్ణ, పుట్ట శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, నాగభూషణం, బండారి శేఖర్, అంకిత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళను వినియోగించుకోవాలి

- జిల్లా వైద్యాధికారి సుదర్శనం

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి మంగళవారం నిర్వహించే ఈ మహిళా ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలని జిల్లా వైద్యాధికారి సుదర్శనం అన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రవాన్ని ఆయన తనిఖీ చేశారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో 124మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 22 మందికి రక్త నమూనాలు సేకరించి జిల్లాకు పంపించారు. ఆరోగ్య సమస్యలు గల స్త్రీలందరికీ మందులు పంపిణీ చేశారు. ఇతర అన్ని రకాల సేవలు ప్రభుత్వ ఆరోగ్య ప్రాథమిక, ఉప కేంద్రాల పరిధిలో ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, ఫైలేరియా వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ అయేషా, డాక్టర్ మానస, ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో నిజామాబాద్‌కు మంత్రి కేటీఆర్

- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఐటి హబ్, నూతన మున్సిపల్ భవనం, మినీ ట్యాంక్ బండ్ దుబ్బా, అర్సపల్లి, వర్ని రోడ్ వైకుంఠదామలు ప్రారంభించేందుకు మంత్రి కేటీఆర్ త్వరలో నిజాంబాద్ కు రానున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా మంగళవారం తెలిపారు. మినీ ట్యాంక్ బండ్, సమీకృత మార్కెట్, కళా భారతి నిర్మాణం పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మరి కొద్ది రోజుల్లో ఐటి హబ్, నూతన మున్సిపల్ భవనం, మినీ ట్యాంక్ బండ్ దుబ్బా, అర్సపల్లి, వర్ని రోడ్ వైకుంఠధామాలను పురపాలక పట్టణాభివృద్ధి, ఐటి శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్ అధికారులు పాల్గొన్నారు.

ఊర పండుగ ఏర్పాట్లు పరిశీలన

ఊర పండుగ ఏర్పాట్లను అధికారులు సర్వ సమాజ్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే బిగాల పరిశీలించారు. ఊర పండుగను ఘనంగా శాంతియుతంగా నిర్వహించుకొనేందుకు అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. అమ్మవారి గద్దె వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సర్వ సమాజ్ కమిటీ విజ్ఞప్తి మేరకు తక్షణమే నిధులు మంజూరు చేశారు. ఊర పండుగకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. దేవత మూర్తులు ఊరేగింపుగా వచ్చే మార్గాల్లో స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ ,నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సర్వ సమాజ్ కమిటీ సభ్యులు బంటు రాజేశ్వర్,రామర్తి గంగాధర్,రామడుగు బాలకిషన్, పుప్పాల రవి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల

మందిరాల నిర్మాణం కోసం ప్రొసీడింగ్ కాపీల అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల/కమ్మర్‌పల్లి/వేల్పూర్

మండలకేంద్రంలో ఎల్లమ్మ మందిర నిర్మాణం కోసం గౌడ సంఘ సభ్యులకు 12 లక్షల ప్రొసీడింగ్ కాపీని, మార్కండేయ మందిర నిర్మాణానికి 12 లక్షల రూపాయల ప్రొసీడింగ్ కాపీలను పద్మశాలి సంఘ సభ్యులకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్,బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, పద్మశాలి సంఘం అధ్యక్షులు కామని శివ కుమార్, పిట్ల నరేష్, కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని ఉప్లూర్ బాల రాజరాజేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణం కోసం రూ.25 లక్షల ప్రొసీడింగ్ కాపీని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారర గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. వేల్పూర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో నిధుల మంజూరు పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిప్పర అనిల్, కమ్మర్ పల్లి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అవారీ మురళి, ఆలయ పూజారి పవన్, బిఆర్ఎస్ నాయకులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

బీమా చెక్కులు అందజేసిన మంత్రి

వేల్పూర్: ప్రతీ కార్యకర్త ఇంటికి కేసీఆర్ పెద్ద దిక్కులా ఉంటారని, కార్యకర్తలకు అన్నివిధాల బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బాల్కొండ శాసన సభ్యులు, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో పార్టీలో కార్యకర్త గా ఉంటూ ప్రమాదవశాత్తు మృత్యువాత పడిన నాలుగు కుటుంబాలకు మంత్రి రెండు లక్షల చొప్పున చెక్కులను పంపిణీచేశారు. వేల్పూర్‌కు చెందిన పడిగే సవిత , ఏర్గట్ల మండలం నాగేంద్ర నగర్‌కు చెందిన గంగామణి, ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామానికి చెందిన దివ్య, కమ్మర్పల్లి మండల కేంద్రానికి చెందిన సయ్యద్ మహమ్మద్‌కు మంత్రి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


ప్రొసీడింగ్ కాపీలు తీసుకుంటున్న కమ్మర్‌పల్లి నాయకులు

సమస్యలు పరిష్కరించకుంటే 14నుండి సమ్మె

నవతెలంగాణ-మోర్తాడ్


వినపతిపత్రం అందజేస్తున్న నాయకులు

2022 మార్చ్ బడ్జెట్లో ప్రవేశపెట్టిన వేతనాలను పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించిన నేటికీ అమలు కాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు అవస్థలు పడుతున్నారని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కింగ్ యూనియన్ జిల్లా నాయకులు మల్యాల గోవర్ధన్, కొండ గంగాధర్, మండల అధ్యక్షుడు నిరంజన్ అన్నారు. నూతనమైన సవరించాలని పెండింగ్ బిల్లును తక్షణమే విడుదల చేయాలన డిమాండ్ చేశారు లేని పక్షంలో జూలై 10 తేదీ నుండి మూడు రోజులపాటు మధ్యన భోజన నిర్వాహకులు సమ్మె నిర్వహిస్తారని అన్నారు. ఈ మేరకు మంగళవాకం మండల విద్యా వనరుల సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈనెల 13 లోపు సమస్యలు పరిష్కరించకుంటే 14 నుండి నిరవధిక సమ్మె చేపడతామనితెలిపారు.

దొడ్డికొమురయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి

- ఘనంగా నివాళ్లు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 77వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పలుపార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయన స్ఫూర్తితో ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ-విలేకరులు

నిజామాబాద్ సిటీ: న్యూ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధ్యక్షతన దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాలతో సత్కరించారు. జ్యోతి ప్రజ్వలనచేసి బూస ఆంజనేయులు, నరాల సుధాకర్, మాయవార్ రాజేశ్వర్, పొల్కం గంగాకిషన్, దర్శనం దేవేందర్‌తో పాటు సహాయ వెబత అభివృద్ధి అధికారులైన పి.నర్సయ్య, టి.గంగాకిషన్, కార్యాలయ సిబ్బంది, సమస్త వసతిగృహ సంక్షేమ అధికారులు, కుర్మ కుల సంఘ ప్రతినిధులు గణేష్, అగ్గుమల్లయ్య పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: సిపిఐ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు కే భూమయ్య, జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. 1946-1948కాలంలో వెట్టి చాకిరి నిర్మూలించడం కోసం జరిగిన పోరాటంలో దొడ్డి కొమురయ్య అమరులయ్యారని అన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న వారందరికీ పట్టాలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రఘురాం, గంగాధర్, ముల్తాన్, ఆనంద్, లక్ష్మి పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తితో రైతాంగ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. నిజామాబాద్ నగరంలో కోటగల్లీ నీలం రామచంద్రయ్య భవన్‌లో ఐకెఎంఎస్, న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హామీ ప్రకారం ఎంఎస్పి మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని పార్లమెంట్‌లో చట్టం చేస్తామని రైతులను మోసం చేసారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం లక్ష లోపు రుణమాఫీ అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.కృష్ణగౌడ్, సాయిలు, న్యూడెమోక్రసీ నాయకులు నీలం సాయిబాబా, భూమన్న, శివకుమార్ ,మురళి, పాల్గొన్నారు.

కంఠేశ్వర్: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దొడ్డికొమురయ్య చిత్రపటానికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు పూలమాలవేసి నివాళులర్పించారు. పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ... తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రారంభమైన తొలినాళ్లల్లో జరిగిన విసునూరు దొర రామచంద్రారెడ్డి, జానకమ్మల నియంతృత్వానికి నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో తూటాలకు బలైన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అడ్రస్ లేని మతోన్మాదులు, బిజెపి వాదులు ఈ పోరాటాన్ని వక్రీకరించి ప్రపంచ చరిత్ర కలిగిన ఈ పోరాటాన్ని అవమాన పరుస్తున్నారన్నారు. దొడ్డి కొమురయ్య చనిపోయిన జులై 4వ తేదీని అమరవీరుల సంస్మరణ దినంగా ప్రకటించాలని సూచించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఇతర ప్రజా సంఘాలు పేదలకు గూడుకోసం పోరాటం చేస్తున్నాయని, నీడ లేనివారు గుడిసెలు వేసుకుంటున్నా గుడ్లప్పగించి చూస్తున్న ఈ ప్రభుత్వం అందరికీ ఇళ్ల స్థలాల పట్టాలిచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలన్నారు. అందుకు 15 లక్షల రూపాయలు ఉచిత ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. పోడుభూముల పట్టాలు గిరిజనేతనులకు కూడా ఇవ్వాలని, కబ్జాలో ఉన్న వాళ్ళందరికీ నిబంధనలు లేకుండా పట్టాలిచ్చి అన్ని ప్రభుత్వ పథకాలను వర్తింపజేసే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్, పెద్ది వెంకట్రాములు, జిల్లా ఉపాధ్యక్షులు నర్ర శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి శశికళ, జిల్లా కమిటీ సభ్యులు సాయిలు, నరసయ్య, రాజేశ్వరి, సావిత్రి నర్ర కళ, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఆర్మూర్: పట్టణ కేంద్రంలోని కుమార్ నారాయణ భవన్ లో సిపిఐ ఎంఎల్ ప్రజాపందా ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం ప్రజాపంద జిల్లా నాయకులు ముత్తెన్న, సబ్ డివిజన్ కార్యదర్శి బి కిషన్ మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారని . దీన్నే తెలంగాణా సాయుధ పోరాటంగా పిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ నాయకులు రాజన్న , గంగన్న , పిడిఎస్ ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్ , పి వై ఎల్ జిల్లా నాయకులు రవి, మనోజ్, అఖిల్, అఫ్జల్, పి ఓ డబ్ల్యు నాయకులు అమ్మక్క, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీలో దొడ్డికొమురయ్యకు నివాళులు అర్పించారు. అతి చిన్న వయసులో స్వాతంత్రంకోసం పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, సాయిబాబా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలో సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి అశోక్ అధ్యక్షతన నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి సభకు ప్రగతిశీల వ్యవసాయ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దొడ్డి కొమురయ్య వారసత్వాన్ని కొనసాగించినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అశోక్, కిషన్, మండల అధ్యక్షుడు ఉట్నూర్ బాలయ్య డాక్టర్ సత్యనారాయణ గౌడ్, అశోక్ పాల్గొన్నారు.



కంఠేశ్వర్: నివాళ్లు అర్పిస్తున్న నాయకులు


నిజామాబాద్‌సిటీ : నివాళ్లు అర్పిస్తున్న అధికారులు


కమ్మర్‌పల్లిలో..

ఉన్నత విద్య మండలి చైర్మన్‌కు శుభాకాంక్షలు


నవతెలంగాణ-డిచ్‌పల్లి


లింబాద్రికి బొకేను అందజేస్తున్న టీయూ బోధనేతర సిబ్బంది

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రిక్కా లింబాద్రిని మంగళవారం హైదరాబాద్ లోని కార్యాలయంలో తెలంగాణ యూనివర్సిటీ బోధనేతర సిబ్బంది ఏఈ బి వినోద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి సాయ గౌడ్, సూపరింటెండెంట్ బి భాస్కర్, జి నరేందర్ చైర్మన్ లింబాద్రి కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ/వేల్పూర్


వేల్పూర్‌లో నివాళ్లు అర్పిస్తున్న మంత్రి

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు, బాధ్యతాయుతమైన పాత్రను పోషించి ప్రగతి ప్రజ్వరిల్లి, ఉజ్వల సమాజానికి నాంది కావాలని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ రావుట్ల నరసయ్య అన్నారు. మంగళ వారం పాఠశాలలో అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద, దొడ్డి కొము రయ్య చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వేల్పూర్ : వేల్పూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ పోరాట వీరుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు.

నవతెలంగాణ
కామారెడ్డి
బుధవారం 05 జులై 2023

సమాచార హక్కు చట్టం బోర్డులను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం 2005 బోర్డులను ఏర్పాటు చేయాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ సమితి సభ్యులు ఎల్లారెడ్డి డివిజనల్ అధ్యక్షులు ఇంతియాజ్, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షులు శెబాష్, లింగంపేట్ మండల అధ్యక్షులు ప్రభాకర్, నజీబ్, మాక్సుద్, మంజూర్, రాజేశం, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం..!

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలంలో యథేచ్ఛగా విద్యుత్ చౌర్యానికి కొందరు వ్యక్తులు పాల్పడుతున్నారు. లారీల ద్వారా వే బిల్లు లేకుండా ఇసుకను డంపింగ్ చేసుకొని దొడ్డు ఇసుకను జాలి పట్టుకోవడానికి విద్యుత్ స్తంభాలకు కొండీలు వేసి యథేచ్ఛగా రాత్రి సమయంలో పట్టుకుంటున్నారు. రహదారి పక్కనే విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇంత జరుగుతున్న విద్యుత్ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని, పలువురు ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు : ఏఈ సంకీర్త్

అక్రమంగా విద్యుత్ స్తంభాలకు కొండీలు వేసుకుని చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని విద్యుత్ ఏఈ సంకీర్త్ హెచ్చరించారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు కనిపిస్తే విద్యుత్ కార్యాలయంలో సమాచారం అందజేయాలని తెలిపారు.

ఉపాధి హామీలో అవినీతి కంపు

- చట్టం అమలు తీరుపై కొరవడిన పర్యవేక్షణ
- అధికారుల నిర్లక్ష్యం.. సిబ్బంది ఇష్టారాజ్యం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నిరుపేద కూలీలకు ఉపాధిని కల్పించి వలసలను అరికట్టేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ చట్టం (ఎన్ఆర్ఈజీఎస్) అవినీతి కంపుతో అభాసు పాలవుతోంది. అవినీతిపరులకు ఈ చట్టం మంచి ఆదాయ మార్గంగా మారింది. దొరికినంత దోచుకోవడం, ఆపై చేతులెత్తేయడం అలవాటుగానే మారింది. డీఆర్డీఏ ఉన్నతాధికారులే అవినీతిపరులకు పరోక్ష సహకారం అందిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చట్టం ప్రారంభమైనప్పటి నుంచి బాన్సువాడ డివిజన్ పరిధిలో కోట్ల రూపాయల పనులను చేపట్టి ఎంతో మంది కూలీలకు ఉపాధిని కల్పించారు. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ.. క్షేత్రస్థాయిలో దీని అమలుపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయింది. దీంతో రెచ్చిపోతున్న అవినీతిపరులు అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు.

బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్ మండలంలో సోమవారం స్థానిక రైతు వేదిక భవనంలో ఉపాధి హామీ సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. గడిచిన మూడు సంవత్సరాల ఖర్చుపై సామాజిక తనిఖీలు చేపట్టగా రూ.36 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు తెలిసింది. అలాగే జనవరి నెలలో బీర్కూర్ మండలంలో ఉపాధి హామీపై గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేశారు. ఇందులో ఎన్నో విషయాలు తెలిశాయి. ఇక్కడ మృతి చెందిన వ్యక్తులు పని చేసినట్లు రికార్డు చేశారు. వర్షాకాలంలో మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీరు పోసినట్లు లక్షల్లో డబ్బులు ఖర్చు చేశారు. ఈ సామాజిక తనిఖీలో ఎన్నో విషయాలు బైటకొచ్చాయి. ఇందులో చనిపోయిన వ్యక్తి పని చేసినట్లు రికార్డ్ రాశారు. అదే గ్రామానికి చెందిన ఓ మహిళ పని చెయ్యకపోయినా చేసినట్లు రికార్డు చేశారు.



ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

ఓ గ్రామంలో పెళ్లి అయిన యువతి పని చేసినట్లు రికార్డ్ చేశారు. మండలంలో వేల సంఖ్యలో మొక్కలు నాటినట్లు రికార్డులు చేశారు. కానీ క్షేత్ర స్థాయిలో లేకపోవడంతో తనిఖీ బృందం కంగుతింది. ఈ విచారణలో కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు నిర్ధారించారు. ఇందులో కొందరిపై జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో కొందరికి రికవరీకి ఆదేశించారు.

ప్రభుత్వ నిబంధనలు గాలికి వదిలేశారు. అడిగే వారే లేకపోవడంతో అవినీతిపరులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతుందన్న విమర్శలు వస్తున్నాయి. ఉపాధిహామీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై మరింత లోతుగా దర్యాప్తు జరిపితే అవినీతి అధికారుల బాగోతం బయట పడే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అవినీతిపరులపై అంత ప్రేమెందుకో..

ఉపాధి హామీలో అవినీతికి పాల్పడిన వారికి కొందరు ఉన్నతాధికారులు వత్తాసు పలుకడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతియేటా ఉపాధి హామీలో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు సామాజిక తనిఖీలను జరిపి ప్రజావేదికల ద్వారా అవినీతిని బయటపెట్టినా.. ప్రయోజనమే లేకుండా పోయింది. అధికారుల వైఖరితో అవినీతి లెక్కలు రికార్డులకే పరిమితమవుతున్నాయి. చట్టం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు కోట్ల రూపాయలు దుర్వినియోగమైనా.. లక్షల రూపాయల్లోనే రికవరీ చేశారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా అధికారుల తీరు మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం అవినీతికి పాల్పడిన వారిపై ఆర్ఆర్ (రెవెన్యూ రికవరీ యాక్ట్-1890) ప్రకారం నిధులను రికవరీ చేయాల్సి ఉన్నా.. ఇప్పటివరకు ఏ ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోలేదంటే అధికారుల నిర్లక్ష్యం ఏ మేరకు ఉందో తెలుస్తూనే ఉంది. రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్న చందంగా ఉపాధి నిధులు మారాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధికారులు రికవరీ జోలికి వెళ్లకుండా అవినీతికి పాల్పడిన సిబ్బంది నుంచి ఎంతో కొంత దండుకుని కావాలనే కాలయాపన చేస్తూ.. వదిలేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

నవతెలంగాణ-నసురుల్లాబాద్ (బీర్కూర్)

భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన మేత్రి మధు (35) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బతుకు దెరువు కోసం ఆర్మూర్ ప్రాంతంకు వెళ్లి వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. ఈయనకు గత ఐదు ఏండ్ల క్రితం వివాహం కాగా కుటుంబ కలహాలతో కొద్ది రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. ఆమె తిరిగి కాపురానికి రాకపోవడంతో భర్త మనస్తాపానికి గురయ్యాడు. గత వారం రోజుల క్రితం సొంత గ్రామానికి వచ్చాడు. సోమవారం రాత్రి ఇంటి పక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. ఉదయం చూసే సరికి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న కొడుకును చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఘటన స్థలాన్ని బీర్కూర్ పోలీసులు పరిశీలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దు

నవతెలంగాణ-రామారెడ్డి

గ్రామ అభివృద్ధికి అటంకం కలిగిస్తున్నాడని, గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన పనుల చెల్లింపుల బిల్లుల చెక్కులపై ఉద్దేశపూర్వకంగా సంతకం చేయడం లేదని, గ్రామపంచాయతీ సమావేశాలకు గైర్హాజరవుతున్నాడని సర్పంచ్ స్రవంత పరమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉప సర్పంచ్ సలావత్ రవి నాయక్ జాయింట్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ ఉత్వరులు జారీచేశారు. ఎంపీఓ సవితా రెడ్డికి జాయింట్ చెక్ పవర్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని కన్నాపూర్ తాండ, గోకుల్ తాండ గ్రామపంచాయతీ పరిధిలో పోడు రైతులకు బుధవారం పట్టాలు అందజేయడానికి ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు జాజాల సురేందర్ రానున్నట్టు సర్పంచులు చందర్ నాయక్, లలితా లింబాద్రి నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేదలకు భూములు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు వినతి

నవతెలంగాణ-లింగంపేట్


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిరుపేదలైన వారికి ప్రభుత్వం సాగు భూములు ఇవ్వాలని సీపీఐ(ఎం) మండల కమిటీ నాయకులు భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మార్వో చంద్ర రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీనగర్ గ్రామ సమీపంలోని సర్వేనెంబర్ 326లో లింగంపేట్ గ్రామానికి చెందిన నిరుపేదలు భూమి లేని వారు 20 మందిని 2008 సంవత్సరం అక్కడ భూమిని చదును చేశామన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం నిరుపేదలకు పట్టాలు ఇవ్వలేదని ఆయన అన్నారు. ప్రభుత్వం అసలైన నిరుపేదలను గుర్తించి వెంటనే పట్టా ఇవ్వాలని పేర్కొన్నారు. కూలీ నాలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న నిరుపేదలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన అన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు భాస్కర్, రమేష్, పద్మ సావిత్రి, లక్ష్మి, లింగవ్వ రాజయ్య, రాధా, బాబు తదితరులున్నారు.

జాయింట్ సర్వే నిర్వహించి
పేదలకు న్యాయం చేయాలి

- పలు ఎజెండా అంశాలపై చర్చ
- సజావుగా లింగంపేట్ మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-లింగంపేట్

గత 50 సంవత్సరాలు నుంచి సాగు చేస్తున్న పేదలకు అటవీశాఖ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సంయుక్త సర్వే నిర్వహించి సాగు చేస్తున్న పేద రైతులకు న్యాయం చేయాలని ప్రజా ప్రతినిధులు రెవెన్యూ శాఖ, అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మండల కేంద్రంలో ఇందిరాక్రాంతి పథకం కార్యాలయంలో ఎంపీపీ గరీబునిస నయీమ్ అధ్యక్షతన సర్వసభ సమావేశం మంగళవారం నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా శెట్టిపల్లి సంగారెడ్డిలో సర్వేనెంబర్ 14,29 అదేవిధంగా 674 సర్వే నెంబరులో కొందరు రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారని, గతంలో వీరికి పట్టాలిచ్చారని, ప్రస్తుతం అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు ఎమ్మార్వో, అటవీశాఖ అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. యాసంగిలో వడగళ్ల వాన కారణంగా 3371 ఎకరాలలో 1604 మంది రైతుల పంట నష్టం జరిగిందని నివేదికను ప్రభుత్వానికి అందజేశామని వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ అన్నారు. ప్రతి రైతుకు రైతుబంధు వస్తుందన్నారు. సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన సూచించారు. మోతే, నల్లమడుగు, సజ్జనపల్లి గ్రామాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని వర్షాకాలంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని మోతే సర్పంచ్ ఏలేటి రాంరెడ్డి విద్యుత్తు ఏఈ దృష్టికి తీసుకురాగా విద్యుత్ శాఖ ఏ ఈ అశోక్ స్పందించి సకాలంలోనే సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. రేషన్ కార్డులో కొత్త పేర్లు నమోదు చేసుకోవచ్చని ఎమ్మార్వో చంద్ర రాజేశ్వర్ అన్నారు. అనంతరం వివిధ శాఖలపై చర్చించారు. ఈ సర్వసభ సమావేశంలో జెడ్పీటీసీ ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ శమినిషా బేగం, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న పలువురు

గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించినట్టు సర్పంచ్ పచ్చుంటి సత్తయ్య తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా రూ.20 లక్షల నిధులతో ఎమ్మెల్యే జాజాల సురేందర్ సహకారంతో జిల్లాలోనే నూతన గ్రామ పంచాయతీలలో మొట్టమొదటిసారిగా సిద్దాపూర్ గ్రామపంచాయతీ భవనానికి నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అన్ని రకాల వసతులతో కూడిన నూతన గ్రామపంచాయతీ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టి త్వరలోనే అందుబాటులోకి నూతన పంచాయతీ భవనాన్ని తీసుకొస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూపాల్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయండి


వర్ని : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని/ఎడపల్లి

గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6 నుంచి కార్మిక సంఘాల జేఏసీ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం వర్ని మండల కేంద్రంలో సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. 51 జీవోను సవరించి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ట్రాక్టర్ డ్రైవర్లకు పంచాయతీల ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుడ్డక్కల సాయిలు, సాయి చరణ్, గంగామణి, సాయవ్వ, చిన్నసాయిలు తదితరులు పాల్గొన్నారు

సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ..

ఎడపల్లి : గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, ఇతర సిబ్బంది సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో ఈ నెల 6న జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులతో పాటు ఇతర సిబ్బంది సీఐటీయూ పిలుపులో భాగంగా సమ్మె కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు జిల్లా నాయకులు, జేఏసీ కన్వీనర్ జంగం గంగాధర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంగరాజు, కుంట సంతోష్, హజ్మత్, స్వామి తదితరులున్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుంటేనే విజయం

- ఎమ్మెల్యే షకీల్ ఆమెర్
- మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన
- జాబ్ మేళాకు 4000 మంది హాజరు

నవతెలంగాణ-బోధన్

నేటి యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే విజయం సాధ్యమవుతుందని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల ఇందూర్ హైస్కూల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో బోధన్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించినట్టు తెలిపారు. ఈ జాబ్ మేళాలో 82 కంపెనీలు పాల్గొన్నారని అన్నారు. అభ్యర్థుల అర్హతలను బట్టి ఉద్యోగం సాధించుకునే అవకాశం ఉందని దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఉద్యోగమేళాలో ఉమ్మడి జిల్లా నుంచి 4,000 మంది అభ్యర్థులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉద్యోగ మేళాలో పాల్గొన్న వారికి ఆయన భోజన సౌకరం కల్పించారు. అనంతరం ప్రైవేట్ పాఠశాలల యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయి, ఇందూర్ హైస్కూల్ అధినేత కొడాలి కిషోర్, సూర్యప్రకాశ్, శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ శరత్, గుమ్ముల అశోక్ రెడ్డి, ప్రయివేటు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటీకి 22 మంది మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. రాష్ట్రంలోనే ఒకే పాఠశాలకు చెందిన 22 మంది ఎంపిక కావడం గర్వకారణమని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

బోగస్ ఓట్లను తొలగించాలని ఆర్డీవోకు వినతి

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలో ఉన్న బోగస్ ఓట్లను తొలగించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవో రాజేశ్వర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షులు పాషా మోహినిద్దీన్ మాట్లాడుతూ బోధన్ టౌన్ తో పాటు నియోజకవర్గంలో గల బోగస్ ఓట్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర నుంచి కొన్ని దొంగ ఓట్లను బోధన్ పట్టణంలో నమోదు చేయించే అవకాశముందని సందేహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ హరికాంత్ చారి, కౌన్సిలర్, దాము, యూత్ ప్రెసిడెంట్ తలారి నవీన్, జహీర్, వహీద్, మైనార్టీ ప్రెసిడెంట్ కలీం పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- పలువురు ఎంపీటీసీలు గైర్హాజరు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇబ్బందులపై తెలిపారు. విద్య, వైద్య, వ్యవసాయ శాఖలపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. వ్యవసాయ శాఖా అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు చేయాలని తెలిపారు. 8 మంది ఎంపీటీసీలు ఉండగా 5 గురు గైర్హాజరు కావటంతో ఎలాంటి తీర్మానాలు చేయలేదు. ఈ సమావేశంలో జడ్పీటీసీ ఉషగౌడ్, ఎంపీడీఓ నారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సెక్రెటరీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం : వైస్ ఎంపీపీ..

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ, ఎంపీడీఓ కలిసి నిధుల దుర్వినియోగం చేశారని వైస్ ఎంపీపీ నర్సింహులు ఆరోపించారు. ఎంపీడీఓ నారాయణ విధులు సరిగా నిర్వహించటం లేదని వారానికి ఒకరోజు వస్తున్నారని, మాకు సమాచారం లేకుండానే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారని, అందుకే ఈ సమావేశానికి ఎంపీటీసీలం గైర్హాజరు అయినట్లు తెలిపారు. తీర్మానాలు లేకుండానే నిధులు డ్రా చేశారని ఆరోపించారు. నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కాగా దీనిని ఎంపీపీ ఖండించారు. నిధుల దుర్వినియోగం అసత్య ఆరోపణలు అని, అలాంటివేవీ జగలేదని ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్ తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీపీ

నాగల్‌గావ్ అంగన్‌వాడీలో పౌష్టికాహారంపై అవగాహన

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని నాగల్‌గావ్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపైన గర్భిణులకు, బాలింతలకు, కిషోర బాలికలకు అవగాహన కల్పించినట్టు అంగన్‌వాడీ టీచర్ అంజమణి తెలిపారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ కపిల్ పటేల్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ అంగన్‌వాడీ పిల్లలకు పాలు, గుడ్లు, పెరుగు, స్నాక్స్, నిత్యం కూరగాయలతో వేడి పౌష్టికాహారం కేంద్రంలో అందిస్తున్నదని, బాలింతలకు బాలమృతం అందించడమే కాకుండా వైద్యుల పర్యవేక్షణలో గర్భిణులకు, బాలింతలకు, కిషోర బాలికలకు, పౌష్టికాహారం లోపం ఉన్నపిల్లలకు ప్రత్యేకంగా బూస్టర్ డోస్ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కపిల్ పటేల్, ఉప సర్పంచ్, అంగన్‌వాడీ టీచర్ అంజమణి, ఆయా, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


బాలమృతం వేస్తున్న సర్పంచ్

ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు రోగులకు మరిన్ని సేవలందించాలి

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల పనితీరు సంతృప్తిగా ఉందని ఎడపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కే శ్రీనివాస్ కితాబు ఇచ్చారు. ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆసుపత్రి వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ వైద్య సిబ్బంది సాధారణ కాన్పుల కోసం విశిష్ట కృషి చేస్తున్నారని కొనియాడారు. మహిళలు గర్భవతి అయిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు ప్రతి ఒక్క మహిళాకు న్యూట్రిషన్ కిట్ నుంచి కేసీఆర్ కిట్ వరకు లబ్దిపొందుతున్నారని అన్నారు. దీంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరో మారు కాయ కల్ప పథకానికి ఎన్నిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినీత్ రెడ్డి, ఆయుష్ వైద్య అధికారి వెంకటేష్, ఎడపల్లి మండల కంటి వెలుగు ఇన్చార్జి ప్రాథమిక వైద్య ఆరోగ్య అధికారి రాజ్ కుమార్, ఆస్పత్రి పాలనాధికారి రాములు, నర్సులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రషర్ మిషన్ తొలగించాలని వినతి

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని గోపాలపల్లి గ్రామ సమీపంలో గల క్రషర్ మిషన్ తొలగించాలని గోపనపల్లి గ్రామ యువకులు తహసీల్దార్ భరత్‌కు, ఎస్సై శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. బిచ్కుంద గ్రామ శివారులో గల సర్వే నంబర్ 138/1 ఎల్లయ్య అండ్ సన్స్ క్రషర్ మిషన్‌ను వెంటనే తొలగించాలని క్రషర్ మిషన్ గోపనపల్లి గ్రామానికి 500 మీటర్ల దూరంలో ఉండడం వలన గోపాన్‌పల్లి గ్రామ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. బ్లాస్టింగ్లు చేయడం వల్ల గ్రామంలో ఉన్న ఇండ్లు బీటలు వారి శిథిలావస్థకు చేరుతున్నాయని, డాంబర్ ప్లాంట్ నడపడంతో నల్లటి పొగ వలన క్యాన్సర్ వ్యాధులు రావడం, క్యాన్సర్ వ్యాధులతో చాలామంది చనిపోయినట్టు తెలిపారు. టిప్పర్‌లో కాంక్రీట్ తీసుకెళ్లడం వల్ల చాలా మందికి డస్ట్ ఎలర్జీ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. గ్రామానికి దగ్గర క్రషర్ మిషన్ ఏర్పాటు చేయడం వలన గ్రామ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ ప్రాంతం నుంచి క్రషర్ మిషన్ తీసివేసి వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి విష్ణు, గంగాధర్, బలగం నాగరాజు, నాయిని సందీప్, నాయిని శ్రీకాంత్, కొట్టే సంతోష్, బలగంరవి, విశ్వనాథ్, శ్రవణ్, అనుశెట్టి బస్వరాజు, శేఖర్, సిద్ధిరామేశ్వర్, గ్రామస్తులు ఉన్నారు.



కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-దోమకొండ

కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలోని కుర్మ సంఘం, కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం 4లక్షల రూపాయలు, ఎస్సీ మాల సంఘానికి 3లక్షల రూపాయలు మంజూరు పత్రాన్ని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విప్ నివాసంలో సంఘం సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ముజిబోధిన్, జడ్పీటీసీ తిర్మాల్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు గంప్ర మధుసూదన్ రావు, కుర్మ సంఘము సభ్యులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-సదాశివనగర్



సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులు మంగళి నర్సవ్వ కు 24 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గాదారి అశోక్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు పాపానోళ్ళ బీరయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు పెసరి సాయిలు, సింగిల్ విండో డైరెక్టర్ ఏనుగు జనార్ధన్‌రెడ్డి, కోఆప్షన్ నెంబర్ అల్తాఫ్, వీడీసీ చైర్మన్ కుమ్మరి రాజయ్య, ఉపసర్పంచ్ వంకాయల రవి, దాకయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో

సాయుధ పోరాటం ప్రత్యేకం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం అని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు అన్నారు. నగరంలోని బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాల లో అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. జయంతి ఉత్సవాల సందర్భంగా ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ పాల్గొని మాట్లాడారు. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి ప్రాణాలర్పించిన యోధుడు అని అన్నారు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు అయిన అనుచరులతో బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడని తెలిపారు. రోటరీ క్లబ్ ఇంచార్జ్ అధ్యక్షులు విజయ రావు, ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమారి, డైరెక్టర్ రాజ్ కుమార్ సుబేధార్, గౌరవ అతిథి చిలక ప్రకాష్, కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ అంకిత్ అగర్వాల్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళ్లు

ఆర్మూర్ : స్వాతంత్ర సమరయోధులు, తెల్ల దొరలను ముప్పు తిప్పలు పెట్టిన అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు 126వ జయంతిని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి అంబేద్కర్ చౌరస్తా వద్ద అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ మాట్లాడుతూ.... అల్లూరి సీతారామరాజు తెల్లదొరలను ముప్ప తిప్పలు పెట్టి దేశ స్వాతంత్రంకోసం పోరాటం చేశారన్నారు. ప్రశ్నించిన, ఎదురించిన వారిని అనగదొక్కుతున్న నయా నిజాం సర్కార్ కేసీఆర్‌ను పారద్రోలడానికై తెలంగాణ ప్రజలు సీతారామరాజును ఆదర్శంగా తీసుకొని ఓటు అనే ఆయుధాన్ని వినియోగించుకొవాలని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నిజామాబాద్ పార్లమెంట్ దళిత మోర్చ కన్వీనర్ నల్ల రాజారాం, బిజెపి పట్టణ కార్యదర్శి పులి యుగంధర్, బిజెపి పట్టణ సంయుక్త కార్యదర్శి భవాని శ్రీకాంత్, గిరిజన మోర్చ పట్టణ అధ్యక్షులు కెలోత్ పీర్ సింగ్, ఓబీసీ మోర్చ ఆర్మూర్ పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, కార్యదర్శులు , కిసాన్ మోర్చా పట్టణ కార్యదర్శి ఈ రెడ్డి నవీన్, తదితరులు పాల్గొన్నారు.



జయంతిలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్

అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దేవగంగు

నవతెలంగాణ-సిరికొండ

అంగన్వాడీ టీచర్ల సమస్యలను ప్రభుత్వమే పరిష్కరించాలని అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు 18 రకాల పనులను అప్పజెప్పి, ఆన్లైన్ ద్వారా సమాచారం అందజేయాలని తెలపడంతో పెను భారంగా మారిందని అన్నారు. పనికి తగ్గ వేతనం అందజేయాలని, పని భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలను సంఘం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మెబాట తప్పదని ఆమె హెచ్చరించారు. సమావేశంలో అంగన్వాడీ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షులు భాగ్య, కవిత, కల, ఉమారాణి, విజయలక్ష్మి, లక్ష్మి అన్ని గ్రామాల అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవగంగు

దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

నవతెలంగాణ-బోధన్

దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో పాలకులు కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదామని సీపీఐఎంఎల్ ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. మంగళవారం దొడ్డి కొమరయ్య 77వ వర్ధంతిని బోధన్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాలకుల కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యు పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి, ఏ.ఐ.పీ.కే.ఎస్ నాయకులు జి.సీతారాం, సీహెచ్ గంగయ్య, రమేష్, ఐఎఫ్‌టీయూ నాయకులు సలీం, కబీర్ ఖాన్, సురేందర్ సింగ్, దేవి యువజన సంఘం నాయకులు కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : మండలంలోని దేవాయిపల్లి గ్రామంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘం మండల అధ్యక్షులు చేటుకూరి గంగారం, నాయకులు రవి, రాజమల్లు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్ : నివాళులర్పిస్తున్న నాయకులు

పట్టాలిచ్చి గిరిజనుల గోడుని తీర్చిన ప్రభుత్వం బీఆర్ఎస్

నవతెలంగాణ-సిరికొండ

బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల కు పట్టాలిచ్చి వారి గోడును తీర్చిందని ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం సిరికొండ మండల యూత్ అధ్యక్షులు మాలోత్ రాజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సాంకేతిక లోపం కారణంగా కొన్ని అటవీ హక్కు పుస్తకాలలో తప్పులు వచ్చాయని, త్వరలో అధికారులు సరి చేస్తారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి పోడు పట్టాల గురించి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. నీ వెనుక ఉన్న బంజారా నాయకులకు ఎంత మందికి వచ్చాయో నువ్వే లెక్క చేసుకో, బీఆర్ఎస్ నాయకులకి పట్టాలు ఇచ్చారని ఆరోపించిన మాటలు జూటా మాటలని అన్నారు. నాలుగేళ్లలో రూరల్ లో ఎక్కడా కనిపించని భూపతిరెడ్డి నెల రోజుల నుంచి గ్రామాలు తిరగడం సిగ్గుచేటని అన్నారు. ఓట్ల కోసమే తిరుగుతున్నారని, రాజకీయ లబ్ది కోసం బంజారా నాయకులకు చిచ్చులు పెట్టవద్దని తెలపారు. ఆయనతోపాటు దుప్య తాండ ఉపసర్పంచ్ దర్యా నాయక్, బారస సీనియర్ నాయకుడు గోపాల్ నాయక్, యువకులు రాజు, జవహర్ లల్, గోవింద్, బాలు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రాజేందర్

విద్యార్థి దశనుండే ఆర్థికపరమైన అవగాహన అవసరం

- ఆర్‌బీఐ అధికారి ప్రసాద్
- జిల్లాస్థాయి క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్ పోలీస్ లైన్‌లో ఆర్బిఐ దేశవ్యాపంగా నిర్వహించిన ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియర్ లిటరసీలో భాగంగా జిల్లా స్థాయి క్విజ్ పోటి పరీక్షను మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్‌బిఐ. అధికారి పి.ప్రసాద్ హాజరై మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్థికపరమైన అంశాలపై విద్యార్థి దశ నుండే అనగాహన పెంచుకోవడం అవసరం అని అన్నారు. జిల్లా స్థాయి క్విజ్ పోటిల్లో మండల స్థాయి విజేతలుగా నిలిచిన 19 పాఠశాలల నుండి 38 మంది పాల్గొన్నారు. వీరిలో ప్రథమ బహుమతి టిఎన్ఎమ్ఎస్, ఆర్మూర్ విద్యార్థులు వేదశ్రీ, సయ్యద్ అహ్మద్, ద్వితీయ బహుమతి జిల్లా పరిషత్ హైస్కూల్, కమ్మరపల్లి విద్యార్థులు ఆర్.అక్షిత, కె.గణేష్ , తృతీయ బహుమతి జిల్లా పరిషత్ హైస్కూల్, మాక్లూర్ విద్యార్థులు జె.హరిత, వి. ఆకాంక్షలు అందుకున్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ అధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాష్ట్ర మహాసభలకు బయలుదేరిన ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఖమ్మం జిల్లా ఇల్లెందు లో జరగనున్న 8 వ పి వై ఎల్ రాష్ట్ర మహాసభల కు జిల్లా నుండి ప్రతినిధులు మంగళవారం బయలుదేరినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వనమాల సత్యం తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయని ఆయన అన్నారు, స్వదేశీ పేరుతో మోడీ, ఇంటికో ఉద్యోగం అంటూ కేసిఆర్ యువతను మోసం చేశారని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమ సందర్భంగా ఇచ్చిన హామీలు నీటిమూల అయ్యాయన్నారు. ఇల్లందు పట్టణంలో మహాసభల సందర్భంగా భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పివైఎల్ జిల్లా నాయకులు నరసయ్య, శ్రీనివాస్, గంగా దాస్, కత్తుల సాయన్న సాగర్, వెంకటేష్, సంజీవ్, గంగారాం. గంగాధర్, పనాలి తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌బ్రెయిన్ యోగాపై వగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిల్లా పరిషద్ రాం మందిర్ పాఠశాల లో లయన్స్ క్లబ్ అఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మెమోరీ ట్రైనర్ రిటైర్డ్ ప్రిన్సిపాల్, జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారి అందె జీవన్ రావు సూపర్ బ్రెయిన్ యోగా (గుంజిలు) పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జీవన్ రావు మాట్లాడుతూ.. ప్రతి రోజు ఉదయం 14 గుంజిలు తీసినట్లయితే ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మెదడు చురుకుగా పని చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు మెహన్ దాస్ మాట్లాడుతూ ప్రతి రోజు సూపర్ బ్రెయిన్ యోగా చేసినట్లుతే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందుతుందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు చలం, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్ దాస్ వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తమ చారీ, అరవింద్, రాజశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులది అయోమయ పరిస్థితి

- వడ్డీ మోహన్ రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్

రైతులు వర్షాలు లేక పంటలు నాటేందుకు అయోమయ పరిస్థితిలో ఆందోళన చెందుతున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్ర శివారులోని పంట పొలాలకు ఆర్యే ముని వన్నన్, అజిత్ దాస్ జైన్‌లతో కలిసి వెళ్లి రైతులతో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా నీళ్ల లేక వరి నాటుకోలేని అయోమయ పరిస్థితి ఉందని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు కాగా ప్రభుత్వం త్వరితగతిన కాలేశ్వరం ద్వారా అలీ సాగర్ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అంతకుముందు మండల కేంద్రంలో గడపగడపకు వెళ్లి బిజెపి ప్రభుత్వం చేస్తున్న సుపరిపాలన సంక్షేమ పథకాలపై ప్రజలకు ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఆనంద్, రామకృష్ణ, పుట్ట శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, నాగభూషణం, ఎంపీటీసీ రాధ, అంకిత తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి

రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

బీఎల్‌టియు ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, అసంఘటిత రంగం కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్ పి జిల్లా కార్యాలయం వద్ద బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ 4వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీడీ కార్మికులు,భవన నిర్మాణ కార్మికులు, హమాలీ, వ్యవసాయ రంగం, గల్ఫ్ కార్మికుల్లో నూటికి తొంభై శాతం బహుజన జాతులకు చెందిన కార్మికులు కనీస వేతనాలు లేకుండా పని చేస్తున్నారని అన్నారు. బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరిగాద సిద్ధిరాములు మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం కార్మిక వర్గ వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కార్మిక వర్గం కోసం కృషి చేసే శక్తులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. బహుజన మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత మాట్లాడుతూ.. కార్మిక వర్గంలో 50శాతం శ్రామిక మహిళలు శ్రమ దోపిడి తోపాటు పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బిఎల్ టియు జిల్లా అధ్యక్షులు కె.మధు, ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, నాయకులు యాదయ్య, గంగా శంకర్, హరీష్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు గీతాంజలి, నాయకులు కవిత తదితరులు పాల్గొన్నారు.

పలుపార్టీలనుండి బీఆర్ఎస్‌లో చేరిక

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి, గుమ్మిర్యాల్ గ్రామాల నుండి సుమారు వంద మంది బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల నుండి మంత్రి ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ... ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం,జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్,తొర్తి సర్పంచ్ కుండ నవీన్,గ్రామశాఖ అధ్యక్షులు క్యాతం సుభాష్, వేశాల నర్సారెడ్డి, తోకల ఈశ్వర్,నాయకులు లింగారెడ్డి, ముక్కెర దేవన్న, తాహెర్, గంగభూమన్న తదితరులు పాల్గొన్నారు.



యువకులకు హెల్మెట్లు పంపిణీ

నవతెలంగాణ-ఎడపల్లి

కాంగ్రెస్ పార్టీ నాయకులు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బోధన్ నియోజకవర్గంలో అన్ని గ్రామాలలోని యువకులకు హెల్మెట్లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేకేసీ నిజామాబాద్ జిల్లా చైర్మన్ భాస్కర్ రాజ్, నాగుసూర్ రాజశేఖర్, నవీపేట్ కాంగ్రెస్ పార్టీ మహిళా మండలాధ్యక్షురాలు మమత, ఘనపురం రవి, కేకేసీ నవీపేట్ మండల కోఆర్డినేటర్ చిన్నుబాయి యువకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని మిసన్‌పల్లి, వెంకటపూర్, అగ్రహారం, భిక్కనూర్, శివపూర్ గ్రామాలలో హత్ సే హత్ జోడో కార్యక్రమంలో భాగంగా మంగళవారం పల్లెపల్లెకూ కాంగ్రెస్, గడపగడపకూ సుభాష్ అన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామని అదేవిధంగా పేదోడి సొంతింటి కలను నిజం చేసే విధంగా ఎక్కడ స్థలం ఉంటే అక్కడ ఇల్లు నిర్మించుకునే విధంగా ఐదు లక్షల రూపాయల సహాయం అందిస్తామని చెప్పారు. రైతులతోపాటు కౌలు రైతులకు కూడా ఏడాదికి రూ.15వేల రైతుబంధును ఇస్తామని మహిళలకు ముఖ్యంగా రూ.500లకే సిలిండర్ ఇస్తామని, ఇంట్లో వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, బీడీ కార్మికులకు చేనేత గీతా కార్మికులకు, డయాలసిస్ పేషెంట్లకు, ఎయిడ్స్ పేషెంట్లకు నెలకు రూ.4000 పింఛను ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటీకి ఎల్లారెడ్డి విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు చెందిన సామల సాహితీ పళ్ళవి త్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సాయిబాబా మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినికి ఉపాధ్యాయులు అభినందించారు.

మదన్‌మోహన్‌పై రూపొందించిన సీడీలను ఆవిష్కరించిన కాంగ్రెస్ నాయకులు



సీడీని ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-గాంధారి

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఐటీ సెల్ చైర్మన్, పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్‌పై మండలంలోని ముద్దేల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మోహన్ యాదవ్ పాటను రచించి స్వయంగా ఆయనే పాడిన పాటల సీడీని మండల కేంద్రంలోని హరలే గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్‌రావు, బండరీ పరమేష్, నీలరవి, ఉమ్మాజీ భాస్కర్‌రావు, చాకలి కృష్ణ, కిషన్, బామాన్ సురేష్, సర్దార్ నాయక్, సంతోష్, బాపురావు, సాకారం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు తడి పొడి విధానంపై అవగాహన

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కుప్రియాల్ గ్రామంలో కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, పద్మపాని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు వరి పంటలో తడి పొడి విధానంపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అమృత రాజేందర్ మాట్లాడుతూ రైతులు వరి పంటలో తడి పొడి విధానం అవలబించడం వల్ల వరి పంటలో దోమ పోటు తగ్గడం, అధిక పిలుకలు, దిగుబడి పెరగడం, చీడ పీడల నివారణ, నీటి వినియోగం తగ్గడం, విద్యుచ్ఛక్తి ఆదా చేయడం వంటి ఉపయోగాలు ఉంటాయని వివరించారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒక కిలో బియ్యం పండించడానికి మూడు వేల లీటర్ల నీరు అవసరం కానీ మనం ఆరు వేల లీటర్ల నీటిని వినియోగిస్తున్నామని, నీరు ఆదా చేయడం వల్ల మీథేన్ వాయువు తగ్గడం, భవిష్యత్ తరాలకు నీటిని అందించిన వారమవుతామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మెరుగు సాయిరెడ్డి, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, రైతుబంధు మండల సమన్వయ కర్త భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి 5 మొక్కలు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తిమ్మోజివాడీ గ్రామంలో ఇంటింటికి 5మొక్కలను మంగళవారం పంపిణీ చేశారు. హరితహారంలో భాగంగా మొక్కలు పంపిణీ చేసినట్లు సర్పంచ్ పొన్న స్వప్న తెలిపారు. కార్యక్రమంలో రవీందర్‌రావు, సాయిలు, పొన్న శంకర్, కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్‌కు శంకుస్థాపన

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెగాడపల్లి గ్రామంలో మైనార్టీ శ్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి మంగళవారం సర్పంచ్ శంకర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ఎస్.డీ.ఎఫ్ నిధుల నుంచి 10 లక్షల రూపాయలు, వక్ఫ్ బోర్డు నుంచి 5లక్షల రూపాయలు మంజూరి చేయడంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే షకీల్ ఆమీర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజారెడ్డి, బోధన్ మార్కెట్ కమిటీ మండల వైస్ చైర్మన్ సాలురా షకీల్, బోధన్ బీఆర్ఎస్ యూత్ మండల వైస్ ప్రెసిడెంట్ మేడి రవి, భూమారెడ్డి. రామయ్య, పాషా, కమలాకర్‌రెడ్డి, సార్గం పోతరెడ్డి, సుదర్శన్, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మైనార్టీ నాయకులు అబ్దుల్ యాసిన్, హుసేన్, హైమత్, హైదర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని గన్యాతాండ బిఆర్‌స్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పీర్ సింగ్, రాజేష్ నాయక్ సమక్షంలో వార్డ్ మెంబర్స్, గ్రామ ప్రజలు మంగళవారం కాంగ్రెస్‌పార్టీలో చేరినట్టు మండల నాయకులు తెలిపారు. మండల అధ్యక్షులు చిన్నారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు సొప్పురి వినోద్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, రూరల్ యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ముదురుతున్న కిరాణా సంఘం స్థల వివాదం


- 27 ఏండ్ల కింద 35 మంది సభ్యులు కలిసి 20 గుంటల భూమి కొనుగోలు
- అందరికీ సమాచారం లేకుండానే స్థలంలో వాట పేరు చెప్పి డబ్బులు వసూలు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో కిరాణా సంఘం పేరు పై కొనుగోలు చేసిన స్థల వివాదం రోజురోజుకు ముదురుతుంది. కొనుగోలు చేసిన సమయంలో 35 మందే ఉన్నా ప్రస్తుతం ఆ సంఖ్య 50కి పైగా చేరింది. కొనుగోలు చేసింది 35 మంది సభ్యులు అయితే 50 కి పైగా మంది సభ్యులు ఎలా వచ్చారు..?, స్థలాన్ని ఓ పెట్రోల్ బంకు లీజుకు ఇవ్వాలని సభ్యులకు తెలియకుండా ఎలా నిర్ణయిస్తారు..?, 35 మంది సభ్యులలో కొందరి పేర్లు తీసేయడంతో స్థల వివాదం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

1996 సంవత్సర కాలంలో కిరాణా షాపు నడిపించుకుంటున్న 35 మంది కిరాణా షాప్ యజమానులు ప్రతి మంగళవారం ఒక షాపు తెరిచి ఉంచాలని, తెరిచి ఉంచిన షాపు యజమానులు కిరాణా సంఘంలో డబ్బులు చెల్లించాలని నిర్ణయించుకున్నారు. అలా వసూలు చేసిన డబ్బులతో 2002 సంవత్సరంలో భిక్కనూరు పట్టణంలో ఉన్న చర్చి సమీపంలో 20 గుంటల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ స్థలాన్ని 2008 సంవత్సరంలో కిరాణా సంఘం పేరుమీద శ్రీరామ్ శేఖర్ అధ్యక్షునిగా ఎన్నుకొని రిజిస్ట్రేషన్ చేశారు.

రోజులు గడుస్తున్నా కొద్ది 35 మంది సభ్యులలో 2/3 వ్యక్తులు మరణించగా, మరి కొంతమంది అనారోగ్యం కారణంగా కిరాణా షాపును మూసి వేశారు. అనంతరం కొద్ది రోజుల తరువాత కొంతమంది వ్యక్తులు కలిసి కిరాణా వర్తక సంఘం అని మరో సంఘాన్ని ఏర్పాటు చేసుకొని పట్టణంలో, గాంధీ చౌక్ వద్ద ఏ కిరాణా షాపును నూతనంగా ఏర్పాటు చేసిన సంఘంలో సభ్యత్వం తీసుకొని ఏర్పాటు చేయాలని, సంఘంలో చేరిన వారికి 20 గుంటల స్థలంలో వాటా ఉంటుందని తెలియజేయడంతో నూతనంగా ఏర్పాటు చేసిన కిరాణా షాపు యజమానులు డబ్బులు చెల్లించారు.



35 మంది కలిసికొనుగోలు చేసిన భూమి



ప్రస్తుతం కొద్ది రోజుల క్రితం 20 గుంటల స్థలాన్ని కొంతమంది కిరాణా వర్తక సంఘం వ్యక్తులు పెట్రోల్ బంక్‌కు లీజ్ కు ఇవ్వడంతో స్థల వివాదం తెరపైకి వచ్చింది. 35 మంది సభ్యులు కలిసి కొన్న స్థలాన్ని సభ్యులకు తెలియకుండా ఏ విధంగా లీజుకి ఇస్తారని ప్రశ్నిస్తే కిరాణా షాపు మూసివేసిన వారికి ఎలాంటి సంబంధం లేదని కొందరు వ్యక్తులు తెలపడంతో వివాదం కాస్త మరింత ముదిరింది. 35 మందిలో కొంతమంది అటూ ఇటూ మాట్లాడడం కారణంగా సంఘం సభ్యులు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.

కిరాణా సంఘంలో ఓ వ్యక్తి స్థలాన్ని 35 మంది కలిసి కొనుగోలు చేస్తే స్థలం పేరు చెప్పి నూతనంగా ఏ కిరాణా షాపు ఏర్పాటుచేసినా.. వారి వద్ద నుండి స్థలం పేరు చెప్పి డబ్బులు వసూలు చేయడంతో డబ్బులు చెల్లించిన కిరాణా షాప్ యజమానులు తమకు కూడా వాటా ఉంటుందని 35 మందిపై గొడవకు పాల్పడుతున్నారు. ఈ పంచాయితీ కాస్త మంగళవారం గ్రామపంచాయతీ కి చేరింది. 35 మంది సభ్యుల పూర్తి పేర్లు, చెల్లించిన నగదు వివరాలు, రికార్డులతో ఈనెల 11వ తేదీ నాడు గ్రామపంచాయతీలో చూపించాలని తెలిపినట్లు సంఘం సభ్యులు తెలిపారు.

35 మంది కలిసి కొన్న స్థలం 35 మందికే చెందుతుందని, స్థలం పేరు చెప్పి డబ్బులు ఎవరైతే వసూలు చేశారో చెల్లించిన వారు తీసుకున్న వారిని అడగాలని, డబ్బులు చెల్లించిన వారికి 35 మందికి ఎలాంటి సంబంధం లేదని గత కిరాణా సంఘం సభ్యులు ముక్తకంఠంగా తెలిపారు. స్థలంలో ఎవరైనా నిర్మాణాలు చేపడితే కోర్టుకెళ్తామని హెచ్చరించారు.

గ్రామాభివృద్ధికి రూ.26 లక్షల చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న విప్

నవతెలంగాణ-రామారెడ్డి

మిత్ర అదర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సోలార్ కంపెనీ మండలంలోని మద్దికుంటలో నిర్మించగా, నిర్మాణ సమయంలో గ్రామ అభివృద్ధికి, ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పి, గత 4 సంవత్సరాల నుంచి నిర్లక్ష్యం చేయగా, గ్రామ పాలకవర్గం, వీడీసీ, గ్రామస్తులు.. ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎంపీపీ దశరథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి మిత్ర ఆదర్శ్ కంపెనీతో మాట్లాడారు. రూ. 26 లక్షల చెక్కును గ్రామాభివృద్ధికి ఇప్పించారని, ఇప్పించినందుకు సర్పంచ్ బొమ్మిడి రామ్‌రెడ్డి, వీడీసీ పాలకవర్గ సభ్యులు గంప గోవర్ధన్ కు, ఎంపీపీ దశరథ్ రెడ్డికి, మిత్రాయజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్ రెడ్డి, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షులు బొమ్మిడి రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సలావత్ బుచ్చిరెడ్డి, ఉప సర్పంచ్ నరేందర్, వీడీసీ చైర్మన్ గజ్జల శంకర్, గ్రామ అభివృద్ధి కమిటీ పాలకవర్గం, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యం చేరాలి

15లోగా మొక్కలు నాటడం పూర్తిచేయాలి
కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి(కామారెడ్డి)

శాఖల వారిగా ఇచ్చిన హరితహారం లక్ష్యాలను ఈనెల 15లోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో హరితహారం లక్ష్యాలపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. అన్ని మండలాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాలు పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు లేని మండలాల్లో అటవీ భూముల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉపాధి హామీ, రెవెన్యూ అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. రోడ్ల వెంబడి మొక్కలు లేక పోతే అవెన్యూ ప్లాంటేషన్ చేయాలని సూచించారు. గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోని ఖాళీ స్థలాలలో మొక్కలు నాటే విధంగా చూడాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల ఆవరణలో ఖాళీ స్థలం ఉంటే కరివేపాకు, ఉసిరి, చింత, మునగ, వెలుగ వంటి మొక్కలు పెంచాలని సూచించారు. మొక్కలు నాటడానికి వివిధ శాఖల అధికారులు పోటీపడాలని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి ఐదు మొక్కలు పంపిణీ చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఎఫ్ఓ నిఖిత, డిఆర్డిఓ సాయన్న, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య

తెలంగాణ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా అధికారులు, బీసీ సంఘాల ప్రతినిధులు శివరాం, సిద్ది రాములు, మోహన్ రాజ్ పాల్గొన్నారు.



దొడ్డికొమురయ్యకు నివాళి అర్పిస్తున్న అధికారులు, నాయకులు

వానమ్మ.. రావమ్మ

నవతెలంగాణ-రాజంపేట్/సదాశివనగర్/పిట్లం



గత వారం రోజులుగా ఎండలు మళ్లీ దంచికొడుతున్నాయి. మొదట్లో జోరుగా పడిన వానలు ప్రస్తుతం ఆశించినంత స్థాయిలో పడడం లేదు. మండలంలో రైతులు మొదట్లో కురిసిన వానలకు పూర్తిస్థాయిలో పత్తి, మొక్కజొన్న, సోయా విత్తనాలను ప్రధాన పొలాల్లో విత్తుకున్నారు. దీంతో రైతులు వానమ్మ రావమ్మ అని దేవుళ్లను మొక్కుకుంటున్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో విత్తిన విత్తనాలు పూర్తిస్థాయిలో మొలక ఎత్తలేదు. అదేవిధంగా మొలకెత్తిన విత్తనాలు ఎండల ఉధృతికి పూర్తిగా వాడు చూపుతున్నాయి. దీనితో వర్షాలు సకాలంలో పడతాయో పడవో అని రైతులు భయాందోళన చెందుతున్నారు.

పత్తి పంటకు స్ప్రింకర్‌లతో నీటి సరఫరా



స్ప్రింకర్ల ద్వారా పత్తి పంటకు నీటిని అందజేస్తున్న రైతు

సదాశివనగర్ : సదాశివనగర్ మండలంలోని తిమ్మోజివాడి గ్రామంలోని రైతు గురుడు రవీందర్‌రెడ్డి పత్తి పంటకు స్ప్రింకర్‌లతో నీటిని అందిస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. పత్తి పంట వేసిన నుండి వర్షాలు కురువక పోవడంతో పంట ఎండిపోతోందని ఆవేదన చెందుతున్నాడు. బోరుబావి నీటితో స్పింకర్‌లను ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నట్టు తెలిపారు.

వర్షాల కోసం రైతుల పాట్లు

పిట్లం : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ సమృద్ధి వర్షాలు కురియక పోవడంతో అల్లాడుతున్న రైతులు వర్షాల కోసం పాదయాత్రలుగా ఆలయాల చుట్టూ ప్రదక్షణలు నిర్వహిస్తున్నారు. మంగళవారము మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన రైతులు సమృద్ధి వర్షాలు కురియాలని 11 హనుమాన్ ఆలయాలకు పాదయాత్రగా భజనలు, భక్తి పాటలు ఆలపిస్తూ ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఫ్రెండ్స్ యూత్ సభ్యులు అల్పాహారం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

కుంటలో పడి యువకుడి మృతి

నవతెలంగాణ-సదాశివనగర్



మృతిచెందిన శ్రీను

సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన బండ శ్రీను (30) మంగళవారం మృతి చెందారు. గ్రామంలోని పశువుల ఆసుపత్రి వెనుక భాగంలో ఉన్న కుంటలో చేపలు పట్టడానికి వెళ్లి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడు ఆంధ్ర నుండి వలస వచ్చి ఇదే గ్రామంలో మేస్త్రి పని చేస్తూ ఇదే గ్రామానికి చెందిన బండ సునీతను పెళ్లి చేసుకుని జీవనం సాగిస్తున్నాడని పోలీసులు తెలిపారు.

స్కూల్‌కు వెళ్లిన బాలుడు అదృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి



ప్రవీణ్

స్కూలుకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని స్కూల్ తాండకు చెందిన పిపావత్ ప్రవీణ్ (14) సోమవారం రోజుమాదిరిగా స్కూల్‌కు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో పాఠశాలలో, చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికిన ఆచూకీ దొరకపోవడంతో మంగళవారం తండ్రి సేవ్య స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.